గిట్టుబాటు కాని 'ఉపాధి'

- పనులకు మొగ్గు చూపని కూలీలు
- చేసిన పనికి సకాలంలో అందని డబ్బులు
- సదాశివనగర్ మండలంలో పని చేసే చోట కనీస వసతులు కరువు



భూంపల్లి గ్రామ శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్రప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎండను సైతం లెక్క చేయకుండా ఉపాధి పనికి వెళ్తున్న కూలీలకు సరైన గిట్టుబాటు కూలి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 11, 845 జాబ్‌కార్డులు ఉండగా, 22,070 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. పని చేసిన ప్రతి కూలీకి రూ. 307 గిట్టుబాటు కూలి కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికి క్షేత్ర స్థాయిలో మాత్రం రూ. 100 నుంచి రూ. 150 మాత్రమే కూలి వస్తుందని కూలీలు వాపోతున్నారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఉపాధి పని చేసినప్పటికి తమకు గిట్టుబాటు కూలి ఎందుకు రావడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిలువ నీడ లేదు..

ఉపాధి పనులు జరిగే చోట కూలీలకు నీటి వసతి కల్పించడానికి ప్రతి గ్రామ పంచాయితీకి బాధ్యతలు అప్పగించారు. పని చేసే చోట నీటి వసతి కల్పించినందుకు ఒక్కో కూలీకి రూ. 2.50 పైసల చొప్పున చెల్లిస్తున్నారు. కానీ ఈ విధానం ఎక్కడ అమలు జరుగడం లేదు. కూలీలే స్వయంగా ఇంటి నుంచి తెచ్చుకున్న నీటినే వాడుకుంటున్నారు. కూలీలకు సేద తీర్చుకోవడానికి నిలువ నీడ లేకుండా పోయింది. పని జరిగే చోట ఎక్కడ కూడా టెంట్‌లు కనిపించడం లేదు. అధికారులు దృష్టి సారించి కూలి గిట్టుబాటు అయ్యే విధంగా, కనీస వసతులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

పనికి తగిన కూలి వస్తలేదు



ఇరవైయేండ్ల నుంచి ఉపాధి పని చేస్తున్న కానీ ఇంత ఘోరం అయిన కూలి రావడం ఇదే మొదటి సారి. కనీసం రోజుకు రూ.200 పడడం లేదు. రూ. 110 నుంచి రూ.112 మాత్రమే కూలి పడుతుంది. పనికి తగిన కూలి వస్తాలేదు. చేసిన పనికి కొలతలు సక్రమంగా తీసినప్పటికి మాకు డబ్బులు ఎందుకు తక్కువగా వస్తున్నాయో సార్లే చెప్పాలి.

– రజిత, భూంపల్లి, ఉపాధి కూలీ

రూ.200 పడేటట్లు చూడాలే..



ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ప్రతి కూలికి కనీసం రోజుకు రూ. 200 పడేటట్లు చూడాలి. చేసిన పనికి కూలి రాకపోవడంతో పని చేయడానికి కూలీలు ముందుకు రావడం లేదు. ఎండలో పని చేస్తే రోజుకు రూ. వంద వస్తే ఏం లాభం. అధికారులు పట్టించుకోవాలి. ప్రతి కూలీకి నష్టం జరుగకుండా చూడాలి.

– శివాజీ రావు, భూంపల్లి

కూలీలు ముందుకు వస్తలేరు

చాలా గ్రామాల్లో ఉపాధి పనులు చేయడానికి కూలీలు ముందుకు రావడం లేదు. చేసిన పనిని బట్టి ప్రతి కూలీకి రూ.307 ఇయ్యాలని నిబంధనలు ఉన్నప్పటికి ఆ మేరకు పని చేస్తాలేరు. ఉదయం పూట కేవలం గంట పని చేస్తే రూ. 307 ఇయ్యాలంటే సాధ్యం కాని పని. చేసిన పనిని బట్టి కొలతలు వేసి డబ్బులు ఇవ్వడం జరుగుతుంది. ప్రతి వారం కూలీలకు డబ్బులు వచ్చేలా చూస్తున్నాం.

– శ్రీనివాస్, ఏపీవో, సదాశివనగర్

కూలిన పాఠశాల ప్రహరీ



పోచారంలో కూలిన పాఠశాల ప్రహరీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారంలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. ఇటీవల చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన డ్రెయినేజీలోకి చేరిన వర్షపునీరు పాఠశాల ప్రహరీని తాకింది. దీంతో ప్రహరీ పూర్తిగా తడిసి కూలిపోయింది. ఫలితంగా డ్రెయినేజీలోని నీరు పాఠశాల ఆవరణలోకి చేరింది. రహదారి విస్తరణ పనులు చేపట్టిన సంబంధిత కేపీసీ కాంట్రాక్టర్ నిర్వాకంతో పాఠశాల ప్రహరీ కూలిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. పాఠశాల ప్రహరీ వెంట పైపులైన్ ఏర్పాటు చేయాలని తాము గతంలో సూచించామని, అయినా కేపీసీ సంస్థ ప్రతినిధులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కాంటా చేయాలి



పెద్దమల్లారెడ్డిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వీణ



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సవాయి సింగ్

భిక్కనూరు/బీబీపేట : అకాల వర్షాలకు తడిసిన ధాన్యంను వెంటనే కాంటాలు చేయించాలని కామారెడ్డి ఆర్డీవో వీణ ఆదేశించారు. బుధవారం ఆమె భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో తడిసిన ధాన్యంను పరిశీలించారు. బీబీపేట మండలంలో పలు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, వడ్లలోని తేమ శాతాన్ని ఆమె పరిశీలించారు. అకాల వర్షాలకు వడ్లు తడవకుండా టార్పాలిన్ కవర్లను కప్పి ఉంచాలని రైతులకు సూచించారు. రైతులు ఆందోళన చెందవద్దని ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.ఆమె వెంట డీసీఎస్‌వో మల్లికార్జున్, తహసీల్దార్లు సత్యనారాయణ, శివప్రసాద్, విండో చైర్మన్ రాజాగౌడ్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లో మంగళ వారంరాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం కుప్పలు, తూకాలు చేసిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని బుధవారం మహమ్మద్‌నగర్ మండల తహసీల్దార్ సవాయి సింగ్ పరిశీలించారు.ఆయన వెంట స్థానిక రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయ అభివృద్ధికి విరాళం



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం సికింద్రాబాద్‌కు చెందిన పలంచ నర్సింగరావు–నీరజ దంపతులు బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డికి రూ.25 వేలు విరాళాన్ని అందజేశారు. అలాగే ముంబయికి చెందిన నరేంద్ర–మాలిని దంపతులు రూ.11 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు దాతలను అభినందించారు. ఆలయ కమిటీ ఈవో శ్రీధర్‌రావ్, డైరెక్టర్ లక్ష్మిరాజం, అర్చకులు ఉన్నారు.

ముగిసిన ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



దోమకొండ: మండల కేంద్రంలో రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయ 20 వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. బుధవారం డప్పుచప్పుళ్ల మధ్య తిరుగుబోనాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తీగల నాగభూషణంగౌడ్, ఉపాధ్యక్షులు నర్సాగౌడ్, కార్యదర్శి రవిగౌడ్, కోశాధికారి యాదగిరిగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు రాజనర్సాగౌడ్, తదితరులున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



కామారెడ్డిలో పూజలు చేస్తున్న భక్తులు



ఎల్లారెడ్డిలో వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న స్వర్ణకారులు

కామారెడ్డి అర్బన్/ఎల్లారెడ్డి : పట్టణ పరిధిలోని దేవునిపల్లి శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం, ఆరాధనోత్సవాన్ని బుధవారం అర్చకులు కృష్ణామాచారి, లింగమాచారి నిర్వహించారు. ఎల్లారెడ్డిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణ ప్రాంగణంలో స్వామి వారి చిత్ర పటానికి స్వర్ణకార సంఘం నాయకులు పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగయ్యచారి, ప్రతినిధులు రమేష్‌చారి, భాస్కరాచారి, రవీందర్, లక్ష్మీకాంతం, బి.బ్రహ్మం, అంజనేయులు, శ్రీనివాసాచారిలు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం జెడ్పీహైస్కూల్‌లో కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల హెచ్ఎం వెంకట రమణ కోరారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, లాంగ్వేజ్ స్కిల్స్, కంప్యూటర్ బేసిక్స్, ఇంగ్లీష్ టైప్ రైటింగ్‌లోశిక్షణ ఇస్తున్నామన్నారు. ఉదయం 8:30 నుంచి 10:30 నిమిషాల వరకు శిక్షణ ఉంటుదన్నారు.

జంగమాయిపల్లిలో బోనాల పండుగ



బోనాలతో శోభాయాత్రగా మహిళలు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని జంగమాయిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి బోనాల పండుగను నిర్వహించారు. గ్రామ దేవతల ఆలయాలకు గ్రామస్తులు బోనాలతో శోభాయాత్రగా తరలివెళ్లారు.అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. పిల్లా పాపలు, పాడి పంటలు సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత, కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కుడుముల సత్యనారాయణ, గ్రామపెద్దలు నాగభూషణం ఉన్నారు.

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా సదస్సు



నినాదాలు చేస్తున్న మైనారిటీ నాయకులు

బాన్సువాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టసవరణకు వ్యతిరేకంగా బుధవారం బాన్సువాడలో ముస్లిం మహిళలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు మహిళా కన్వీనర్ జలిసా సుల్తానాతో పాటు పలువురు మహిళా వక్తలు హాజరై మాట్లాడారు. వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసేవరకు శాంతియుతంగా పోరాటం చేస్తామన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారంలో భాగంగా జిల్లాలు, ప్రముఖ పట్టణాల్లో ఆందోళన కార్యక్రమాల పరంపర కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు హాఫీజ్ ఫహీముద్దీన్, సభ్యులు డాక్టర్ ఖుద్దూస్, నసీరాఖానం, తన్‌జీముల్ మజీద్ కమిటీ అధ్యక్షులు ఇంతియాజ్ అహ్మద్, ముఫ్తీ ఉమర్‌బిన్ ఈసా, నాయకులు అలీబిన్ అబ్దుల్లా, అబ్దుల్ ఖాలేఖ్, ఎజాస్, హఫీజ్ వహాబ్, షేక్ అక్బర్, అలీమోద్దీన్‌బాబ, షేక్ అజీమ్, అఫ్రోజ్, ఆతీఫ్, సయీద్‌ఖాన్ పాల్గొన్నారు.

రైతుల కళ్లలో ఆనందం చూడడమే లక్ష్యం

బీబీపేట: రైతుల కళ్లలో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రాణహిత చేవెళ్లకు ప్రభుత్వం నుంచి 22వ ప్యాకేజీ పనులకు నిధులు విడుదల చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, జిల్లా నాయకులు భూమాగౌడ్, సలీం, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాత జన్మదిన వేడుక



భిక్కనూరులో పూజలు చేస్తున్న మహిళలు



ఎల్లారెడ్డిలో.. వైశ్యసంఘం సభ్యులు



గోపాల్‌పేటలో.. ఆర్యవైశ్యసంఘం సభ్యులు

సాక్షి, నెట్‌వర్క్ : ఆర్యవైశ్యుల కులదేవత వాసవి కన్యాక పరమేశ్వరి జన్మదిన వేడుకలను బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి మాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కలశాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. శోభాయాత్ర నిర్వహించారు. బాన్సువాడలో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రసాదాన్ని పంపిణీ చేశారు.



తాడ్వాయిలో కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



లింగంపేటలో..ఆర్యవైశ్య సంఘం సభ్యులు



ఎల్లారెడ్డిలో పూజలందుకున్న అమ్మవారు



దోమకొండలో...



బీబీపేటలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



సదాశివనగర్‌లో.. ఆర్యవైశ్యసంఘం సభ్యులు



బాన్సువాడలో పూజలు చేస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

క్లుప్తంగా

'ఆపరేషన్ సిందూర్'పై సంబురాలు



కామారెడ్డి అర్బన్ : భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలపై దాడులు నిర్వహించినందుకు సంబురాలు నిర్వహించారు. పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో జాతీయ పతాకాలను చేతబూని ప్రదర్శించడంతో పాటు టపాసులు కాల్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఏ.నిత్యానందం, కామారెడ్డి నగర అధ్యక్షుడు వడ్ల వెంకటస్వామి, కార్యదర్శి వంగ ప్రసాద్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ అశోక్, అనిల్, మంచాల రాజు, భరత్, రామ్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జీవితానికి బాట వేసుకోవాలి



కామారెడ్డి క్రైం: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉత్తమ జీవితానికి బాట వేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఇటీవల వెలువడిన పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లాలోని మైనారిటీ గురుకుల విద్యార్థులను, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం తన ఛాంబర్ లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లాకుమంచి పేరు తీసుకురావాలన్నారు.కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్, ఆర్ఎల్‌సీ కిరణ్ గౌడ్, ప్రిన్సిపాళ్లు ఇంతియాజ్ అలీ, వెంకటరాములు, ధనలక్ష్మి, అధ్యాపకులు ఉన్నారు.

గుండెపోటుతో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఈశ్వర్ మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బాణాపూర్ తండాకు చెందిన ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు ఈశ్వర్ (55) బుధవారం గుండెపోటుతో మృతి చెందినట్లు తండా వాసులు తెలిపారు. మృతుడు ఈశ్వర్ లింగంపేట మండలం పర్మళ్ల తండా ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు విధులు నిర్వహించాడు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో తాడ్వాయి మండలం కరడ్‌పల్లికి బదిలీపై వెళ్లాడు. ఆయన మృతితో బాణాపూర్ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని భార్య సంగూబాయి సైతం ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

బాగయ్యకు దళిత రత్న అవార్డు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్యకు దళిత రత్న అవార్డు దక్కింది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతమ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో దళితుల పట్ల చేస్తున్న సేవలకు గాను, అంకిత భావంతో పని చేస్తున్నందుకు ఈ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి



కామారెడ్డి క్రైం: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, నాయకులు ఎండి. మెహబూబ్ అలీ, ఎన్. సంతోష్, వీరయ్య, దీవెన, శివరాజవ్వ, నడిపి నరసరావు, భూలక్ష్మి, ప్రభ, మధు, కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మండలాల బీజేపీ అధ్యక్షుల నియామకం

కామారెడ్డి క్రైం : పార్టీ సంస్థాగత మార్పులో భాగంగా జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని మండలాల అధ్యక్షులను, జిల్లా కౌన్సిల్ సభ్యులను నియమించినట్లు బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండల అధ్యక్షుడిగా తెప్ప తుకారం, నిజాంసాగర్– మేకల నరేష్, పిట్లం–జి. సాయిరెడ్డి, మహమ్మద్‌నగర్– శ్రీకాంత్, పెద్దకొడప్– బాలాజీ పటేల్, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గాంధారీ మండల అధ్యక్షుడిగా మధుసూదన్, రామారెడ్డి–నోముల సందీప్, సదాశివనగర్–కే.రాంరెడ్డి, ఎల్లారెడ్డి రూరల్–నర్సింలులను నియమించారు. అలాగే జిల్లా కౌన్సిల్ సభ్యులుగా హన్మండ్లు, సాయిలు, రవిచంద్ర, అనిల్, క్రిష్ణజ్యోషి, శ్రీకాంత్, అంజయ్య, సాయిలు, పాతుగుంట సాయిలులను ఎన్నుకున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్, లింగంపల్లి(ఖుర్దు) గ్రామాల శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో నరేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. గ్రామ శివారులో చేపల చెరువు పనులు కొలతల ప్రకారం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట క్షేత్రసహాయకుడు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మహిళా సంఘాల ఆడిట్



రాజంపేట: మండల సమాఖ్యలోని 22 గ్రామ సంఘాలపై బుధవారం చార్టర్ అకౌంటెంట్ ఇప్పకాయల రమేష్ ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి బహిర్గత ఆడిట్ నిర్వహించినట్లు మండల ఐకేపీ ఏపీఎం సాయిలు తెలిపారు. ఆడిట్ లో భాగంగా గ్రామ సంఘాల, మండల సమాఖ్యను పుస్తకాల ఆడిట్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సుతారి లక్ష్మి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలో అనుమతి లేకుండా అడ్మిషన్లు ప్రారంభించిన పాఠశాల పై చర్యలు తీసుకోవాలని బుధవారం ఎంఈవో చందర్‌కు విద్యార్థి సంఘాల నాయకుల వినతి పత్రం అందించారు. బొమ్మన్‌దేవ్ పల్లి క్రాస్ రోడ్డు వద్ద గల వెంకట సాయి విద్యానికేతన్ పాఠశాల అభి ఇంటర్నేషనల్ గా పేరు మార్చి అడ్మిషన్లు ప్రారంభించిందన్నారు. సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దత్తు,ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవిందర్ డిమాండ్ చేశారు.

నేడు ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రాక

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలో నిర్వహించే పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గురువారం ఎల్లారెడ్డికి వస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.